

31న పార్వతీపురంలో జాబ్ మేళా

పార్వతీపురం రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఇంటర్ ఎంపిసి, బైపిసి కోర్సుల్లో (2022, 23 సంవత్సరంలో) ఉత్తీర్ణత సాధించి వయస్సు 18 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువత ఈనెల 31న స్థానిక శ్రీ వెంకటేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి యు.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు డాక్టర్ రెడ్డీస్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యి అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారని, కావున ఆసక్తి గల నిరుద్యోగ యువత తమ వివరములను www.apssdc.in వెబ్ సైట్ తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటుగా రెస్యూమే, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్ మరియు జెరాక్స్,1 పాస్పోర్ట్ సైజ్ ఫోటోతో ఉదయం 9 గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 9182398325, 7997299739 నందు సంప్రదించగలరని ప్రకటనలో కోరారు.

తెలంగాణ ఎంసెట్‌లో
మెరిసిన జిల్లా విద్యార్థులు

ప్రజాశక్తి-బొబ్బిలి




ప్రణతిశ్రీజ (ఇంజినీరింగ్ 10వ ర్యాంకు)

తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. గుర్ల మండల కేంద్రానికి చెందిన మీసాల ప్రణతి శ్రీజ రాష్ట్రస్థాయిలో పదో ర్యాంకు సాధించింది. ప్రణతి శ్రీజ ఇటీవల విడుదలైన జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో జనరల్‌లో 78వ ర్యాంకు, ఒబిసిలో 12వ ర్యాంకు సాధించింది. ముంబాయి ఐఐటిలో చదవాలన్నదే తన కోరికని ఈ సందర్భంగా తెలిపింది. ఈ సందర్భంగా శ్రీజను తల్లి దండ్రులు, గ్రామస్తులు అభినందించారు. బాడంగి మండలం మల్లంపేటకు చెందిన వి.సంతోషిని మెడికల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 20వ ర్యాంకు సాధించింది. ఆమె తండ్రి అప్పారావు భోగాపురం జెడ్‌పి హైస్కూలులో ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా, తల్లి భవాని గృహిణి. విజయనగ రానికి చెందిన ఎల్. లావణ్య 156వ ర్యాంకు, బొబ్బిలికి చెందిన పిఎస్ బాలాజీ అభిషేక్ 215, మజ్జి హోమేష్ బాబు 224, పి.భువన్‌సాయి 267, పార్వతీపురానికి చెందిన వి.యాసవి నాయుడు 269వ ర్యాంకు సాధించారు. విజయనగరానికి చెందిన మౌనిష నాయుడు 271, ఎఎస్ సూర్య సాయి ప్రణవ్ 329, పొట్నూరు సాత్విక 361, సిహెచ్‌వి యశ్వంత్ 509, కొల్లి ప్రభాత్ 609, ఎస్.కోటకు చెందిన వి.హోమ ప్రమోద్ 326, బొబ్బిలికి చెందిన ఎం.అనుశ్రీ 398, సాయి కీర్తన 596, బియు మహేశ్వరరావు 607 ర్యాంకు సాధించారు.

కలగా మిగిలిన మినీ రిజర్వాయర్

- పరిశీలనకే పరిమితం
- సాగునీరు ప్రశ్నార్థకం
- బీడు భూములుగా మారుతున్న వైనం
- పట్టించుకోని పాలకులు

చిన్న నీటి వనరులు... పేరులోనే చిన్న ఉన్నప్పటికీ... వాటిని సద్వినియోగం చేసుకుంటే భారీగా ప్రయోజనాలు పొందొచ్చు. భూ సేకరణ, అటవీ పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా తక్కువ సమయం అతి తక్కువ వ్యయంతో సులువుగా నిర్మించుకోడానికి వీలున్నవి చిన్న నీటి వనరులే. కానీ వాటిపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతుంది. ఇందుకు ఉదాహరణ ఎండకొండ- ఈతకొండ మినీ రిజర్వాయర్ నిర్మాణమే.



మినీ రిజర్వాయర్ నిర్మించాల్సిన ప్రదేశం ఇదే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోనే కుంబిడి ఇచ్ఛాపురం పంచాయతీ ఎండ కొండ- ఈతకొండ గ్రామాల మధ్య మినీ రిజర్వాయర్ సుమారు రూ.4కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు నాలుగు దశాబ్దాలు కిందట పరిశీలన చేశారు. ఏళ్ల గడుస్తున్నా ఎక్కడా ఎటువంటి పనులు ప్రారంభించకపోవడంతో సుమారు 2వేల ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఈ మినీ రిజర్వాయర్ పూర్తయితే అచ్చుపువలస గిరిజన గ్రామం నుంచి సీతంపేట మండలం బర్న వరకు కొండ పక్కన ఉన్న భూములు సస్యశ్యామలమవుతాయి. ఇక్కడ మినీ రిజర్వాయర్ నిర్మించేందుకు అప్పట్లో మట్టి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం విశాఖ ల్యాబ్‌కు పంపించారు. ఏళ్ల గడుస్తున్నా ఇక్కడ పనులు చేపట్టక పోవడంతో పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయి.

వర్షాలపైనే ఆధారం

ప్రతి వర్షాలపైనే ఆధారపడి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేస్తున్నప్పటికీ వరుణ దేవుని కరుణ వల్ల పంట చేతికొస్తుంది తప్ప పంటలపై పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నట్లు అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా ఇదే పరిస్థితి తప్పడం లేదని రైతులు గౌరు నాయుడు, ధర్మారావు, ఆనందరావు, చిన్నారావు, సోములు, భాస్కరరావు తదితర వాపోతున్నారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో మోటార్ల సహాయంతో తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ నీటిని ఎగువకు మళ్లించి పంటలు కాపాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో మరింత అప్పులు పాలయ్యే ప్రమాదం ఉందని, అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వృథాగా పోతున్న సాగునీరు

రిజర్వాయర్ పనులు చేపట్టకపోవడంతో సాగునీరు వృథాగా ఒట్టిగెడ్డ కలిసిపోతుంది. మినీ రిజర్వాయర్ పనులు చేపట్టి ఉంటే సాగునీటికి ఇబ్బంది ఉండేది కాదదని, ఏడాదికి రెండు పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మినీ రిజర్వాయర్ పనులు చేపట్టేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన అన్నదాతలు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, పక్కన ఇన్‌ఛార్జి జెసి, డిఆర్‌ఒ

నాడు-నేడు పనులకు సిమెంట్ సరఫరా

ప్రజాశక్తి - కలెక్టరేట్

నాడు-నేడు పనులకు సిమెంట్ సరఫరా చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో నాడు-నేడు పనులకు తక్షణం 2,300 మెట్రిక్ టన్నుల సిమెంట్ అవసరం ఉందని, మొత్తం 4,500 మెట్రిక్ టన్నుల సిమెంట్ సరఫరా చేయాలని అన్నారు. నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలని శాయశక్తులా కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. జిల్లా వాతావరణ పరిస్థితులు పరిగణనలోకి తీసుకుని జిల్లాకు అవసరమగు సిమెంట్ సరఫరా చేయాలని ఆయన కోరారు. ఆసుపత్రుల్లో ప్రసూతి గదులను ఆధునిక వైద్య ప్రమాణాలకు అనుగుణంగా ఆధునీకరణ చేసేందుకు 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంజూరు చేయడం జరిగిందని, వాటి పనులు నిలిపివేస్తూ ఎపిఎంఎస్ఐడిసి ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. పనులు మధ్యలో ఉన్నాయని దీన్ని పునరాలోచించాలని ఆయన అన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఒ జె.వెంకట రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథ రావు, డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డిపిఒ బలివాడ సత్యనారాయణ, డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి కె.రాజకుమార్, జిల్లా మహిళాచ శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, సిపిఒ పి.వీర్రాజు, జిల్లా గిరిజన, సాంఘిక, బిసి సంక్షేమ, సాధికారత అధికారులు బి.సూర్యనారాయణ, ఎం.డి.గయాజుద్దీన్, ఎస్.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం పరిసర గిరిజన గ్రామాల్లో ఉదయం నుంచి ఎండ తీవ్రతకు ఉక్కిరిబిక్కిరి అవుతు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అంతే కాకుండా కురుపాంలో జరుగుతున్న ప్రతి గురువారపు వారపు సంతకు చుట్టుపక్కల పరిసర గ్రామాల గిరిజన ప్రజలు వచ్చి వారానికి సరిపడే నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి తీసుకెళ్తారు. అయితే సంతకు వచ్చిన గిరిజనం ఎండ తీవ్రతకు తట్టుకోలేక చెట్టు నీడలో దుకాణాల్లో తల దాచుకోవడానికి ఆశ్రయించాల్సిన వచ్చింది. సాయంత్రం నాలుగు గంటలయ్యేసరికి వాతావరణం చల్లబడి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో గత రెండు రోజులుగా ఎండ తీవ్రతతో ఇబ్బంది పడుతున్న గర్భిణులకు, వృద్ధులకు, వికలాంగులకు, చిన్నపిల్లలకు, ప్రజలకు వాతావరణం ఉక్కపోత నుంచి కొంత ఉపశమనం కలిగించింది.

పార్వతీపురంటౌన్ : పట్టణంలో గురువారం ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రత కారణంగా ఎండ వేడిమి అధికంగా ఉండి సాయంత్రం వాతావరణంలో మార్పులు ఏర్పడి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసినది. కురిసిన భారీ వర్షానికి ప్రధాన కాలువలన్నీ వర్షపు నీటితో మునిగి రహదారులన్నీ జలమయమయ్యాయి. దీంతో పాదాచారులు, వాహన చోదకులు రహదారులపై వెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు.



కురుపాంలో కురుస్తున్న వర్షం

వీరఘట్టం : మండలంలో గురువారం గాలులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుండి సాయంత్రం వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపటంతో ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్న తరుణంలో వాతావరణంలో ఒక్కసారి మార్పు రావడంతో గాలులు, మెరుపులతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.

పిడుగుపాటుకు మహిళ మృతి

కురుపాం :జియ్యమ్మవలస మండలంలో పిడుగులకు ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన ఇంకొక తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం సింగనాపురం గ్రామానికి చెందిన గంటా పార్వతి(47) ఆ గ్రామ సమీపంలో గల తామరచెరువు వద్ద పశువులు మేపుతుండగా పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే గెడ్డతిరువాడకు చెందిన గుంట్రెడ్డి పట్టాభి నాయుడు(40)సం పొలంలో పశువులు కాస్తుండగా చలిపిడుగు పాటుకు గురై తీవ్రగాయాల పాలయ్యాడు. ఆయన్ను పార్వతీపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



పిడుగుపాటుకు మృతి చెందిన పార్వతి

బకాయి వేతనాలు చెల్లించాలి

ఎంపిడిఒ కార్యాలయం వద్ద గ్రీన్ అంబాసిడర్లు నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

తమకు 12 నెలలుగా జీతాల్లేక, ఇతర పనులకు వెళ్లలేక, ఆకలితో అలమటిస్తున్నామని, తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్మికులు (గ్రీన్ అంబాసిడర్) స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ శిబిరంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు మాట్లాడుతూ 2014లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా పచ్చదనం-పరిశుభ్రత పేరుతో గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని హరిత రాయబారులను నియమించిందన్నారు. వీరి జీతాలను ప్రభుత్వమే చెల్లించేదని, వీరి జీతాలు రెండు, మూడు నెలలకు స్వచ్ఛఆంధ్ర మిషన్ ద్వారా చెల్లింపులు జరిగేవని తెలిపారు. 2022లో వీరిని పంచాయతీలో విలీనం చేసిన తర్వాత కష్టాలు మొదలయ్యాయన్నారు. వీరితో పంచాయతీలు, అధికారులు వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు తప్ప, జీతాలు చెల్లించడంలో శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. కావున గతంలో మాదిరిగా బకాయి వేతనాలు, చెల్లింపులు చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లు కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా కోవిడ్ విధులు నిర్వర్తించారని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజా ఆరోగ్యాన్ని కాపాడడంలో ముందంజలో ఉన్న వీరిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. కనీసం ఉపాధి పనుల్లోనైనా అవకాశం కల్పించాలని, 15 రోజుల్లోగా వీరు వేతనాలు చెల్లింపులకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ల సంఘం మండల అధ్యక్షులు జలుమూరు గౌరి, బాత శంకర్రావు, పెంకి తిరుపతి, కందుకూరు రాము, పలువురు గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

నేడు జలజీవన్ మిషన్‌పై సమావేశం

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో జల జీవన్ మిషన్‌పై సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నామని, సమయపాలన పాటించి విధిగా అందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

జిసిసి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు

సీతంపేట : గిరిజన సహకార సంస్థ స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటున్నామని జిసిసి డివిజనల్ మేనేజర్ జి.సంధ్యారాణి అన్నారు. స్థానిక జిసిసి బ్రాంచ్ కార్యాలయానికి పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. జిసిసి స్థలం పక్కగా ఉండాలన్నారు. స్థలం డాక్యుమెంట్లను తహశీల్దార్ సూరి నరసింహుమూర్తి పరిశీలించారు. జిసిసి ద్వారా నిర్మించిన షాపులు పరిశీలించారు ఆమె వెంట జిసిసి మేనేజర్ దాసరి కష్ణ తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు త్రీ వీలర్స్ బైకులను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

వికలాంగుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద వికలాంగులు, వయోవృద్ధుల సహాయ సంస్థ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు (రెట్రో ఫిట్టేడ్ మోటార్ త్రీ వీలర్స్) మోటార్ వాహనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మోటార్ వాహనాల సహాయంతో వ్యాపారం చేసుకొని స్వయం ఉపాధితో జీవన ప్రమాణాలు పెంపొందించుకొనేలా ప్రభుత్వం వారిలో ఆత్మస్థైర్యం నింపుతుందని తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని అర్హులైన పది మంది విభిన్న ప్రతిభావంతులకు మోటార్ వాహనాలను పంపిణీ చేశారు. వికలాంగులు, వయోవద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు కె.కవిత మాట్లాడుతూ యూనిట్ విలువ రూ.లక్షా 20 వేలు గల మోటార్ వాహనాలను జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 40మంది అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు పంపిణీ చేస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిడిఒ కె.విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ఎపి విలేజ్ వార్డు సెక్రటేరియట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పాలకొండ తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక ఎపిజిఇఎ జిల్లా నాయకులు, ఎపి విలేజ్ వార్డు సెక్రటేరియట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం అధ్వర్యంలో జరిగింది. పాలకొండ తాలూకా యూనిట్ అధ్యక్షులుగా ఎస్.శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బి.నరేష్, ఉపాధ్యక్షులుగా ఆర్.మన్మధరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా టి.వినోద్, సంయుక్త కార్యదర్శి వి.మురళీమోహన్, కోశాధికారిగా ఎస్.సురేష్ ను ఎన్నికున్నారు. కొత్త కార్యవర్గాన్ని జిల్లా నాయకులు నూతులపాటి భరత్‌భూషణ్ రాజు, ఎం.సింహాచలం చిరంజీవి తదితరులు ఘనంగా సన్మానించారు.

దొంగల అరెస్టులో సిబిఐ విఫలం

- బాబాయ్ హంతకుడ్ని ఎందుకు అరెస్టు చేయరు?
- అడ్డుకుంటున్నదెవరో తేల్చాలి
- మినీమహానాడులో అయ్యన్న,కళావెంకటరావు



మినీ మహానాడులో మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి - సాలూరు

సిఎం జగన్ మోహన్ రెడ్డి సొంత బాబాయ్ హత్య కేసులో అసలు దొంగలను అరెస్టు చేయడంలో సిబిఐ ఘోరంగా విఫలమైందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆరోపించారు. గురువారం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి సంధ్యారాణి అధ్యక్షతన జరిగిన అరుకు పార్లమెంటు నియోజకవర్గ మినీమహానాడులో అయ్యన్నపాత్తుడు వైసిపి పాలనను ఎండగడుతూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జగన్ ప్రభుత్వం దోపిడీకి చిరునామాగా మారిందన్నారు. నాలుగేళ్లలో ఈ ప్రభుత్వం పేదలచే రూ.93వేల కోట్లు మన్యం తాగించిందన్నారు. జగన్ బ్రాండ్ మద్యం తాగి అనేక మంది తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని, అన్ని షాపుల్లో డిజిటల్ పేమెంట్లు జరుగుతుంటే వైన్ షాప్‌ల్లో ఎందుకు అనుమతించలేదని ప్రశ్నించారు. మద్యం డబ్బంతా జగన్ ఖాతాలోకి చేరుతోందన్నారు. రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. ఇంతవరకు కోడి కత్తి డ్రామా నడిపి ప్రజల్ని మభ్యపెట్టారన్నారు. సొంత బాబాయ్‌ని హత్య చేసి చంద్రబాబునాయుడుపై ఆరోపించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని అన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ఎంపి అవినాష్‌రెడ్డిని ఇంతవరకు అరెస్టు హైడ్రామా నడిపిస్తున్నారని ఆరోపించారు. అవినాష్‌రెడ్డిని అరెస్టు చేయడానికి సిబిఐ కర్నూలు వస్తే రౌడీలతో అడ్డుకున్నారని చెప్పారు. ఆయన్ను అరెస్టు చేయడానికి సిబిఐ భయపడుతోందన్నారు. మన్ మోహన్ సింగ్ ప్రభుత్వంలో కేంద్ర మంత్రులను అరెస్టు చేసిన సిబిఐ ఇప్పుడు ఎందుకు జాప్యం చేస్తోందని ప్రశ్నించారు. తమిళనాడు మాజీ సిఎం జయలలితను అరెస్టు చేసిన చరిత్ర సిబిఐకి ఉందన్నారు. అలాంటి సిబిఐ రాష్ట్రం లో ఇప్పుడు చచ్చిపోయిందన్నారు. ఖూనీకోరుని కాపాడుతున్న కర్నూలు ఎస్పీ, డిజిపిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 25వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. చంద్రన్న బాటలో భాగంగా ప్రతి పల్లెలోనూ సిసి రోడ్ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతుకులు, గుంతలతో నిండిన రోడ్లకు కనీసం మరమ్మతు పనులు కూడా చేయలేని దుస్థితిలో జగన్ ప్రభుత్వం వుందన్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులు చేయడం లేదని చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రంలో టిడిపిని అధికారంలోకి తేవాల్సిన అవసరం వుందని అయ్యన్నపాత్రుడు చెప్పారు.

చప్పట్లు జగన్‌కు వినిపించాలి: కళావెంకటరావు

జనం కొట్టే చప్పట్లు జగన్‌కు వినిపించాలని మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు అన్నారు. తెలుగు రాష్ట్ర రాజకీయాల్లో ఎన్టీఆర్ యుగపురుషుడన్నారు. జగన్ పాలనను ఒకసారి ప్రజలు చూశారని, మళ్లీ చూడాలనుకుంటే రాష్ట్రం అధోగతి పాలవుతుందన్నారు. బాబాయి హత్యకేసులో అవినాష్‌రెడ్డిని కాపాడుకునేందుకు జగన్ ప్రభుత్వం 25మంది ప్రముఖ న్యాయవాదులతో వాదనలు వినిపిస్తోందని చెప్పారు. ఒక్కో న్యాయవాదికి రూ.75లక్షలు ఫీజు చెల్లిస్తున్నదని ఆరోపించారు. పాదయాత్రలో జగన్ జనాలకు ముద్దులు పెట్టి ఇప్పుడు గుద్దులు గుద్దుతున్నాడని చెప్పారు. రాష్ట్రాన్ని జగన్ జలగలా పీడిస్తున్నాడని విమర్శించారు. ప్రభుత్వంలో అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో సుపరిపాలన కావాలంటే చంద్రబాబు నాయుడు మళ్లీ సిఎం కావాలని చెప్పారు. పార్లమెంటు పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నియమించిన ఇంచార్జులను స్థానిక సీనియర్ నాయకులు గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ మేరకు సమిష్టి కృషితో అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని కళావెంకటరావు కోరారు.

గిరిజన యూనివర్సిటీ ఎక్కడ మంత్రి గారూ?

గిరిజన ప్రాంతంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేస్తానని సిఎం జగన్‌మోహన్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు అది ఎక్కడ వుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్సీ డి.జగదీష్ ప్రశ్నించారు. రాజన్న దొర మంత్రిగా, డిప్యూటీ సిఎంగా నియోజకవర్గానికి ఏమీ చేయలేదన్నారు. ప్రోటోకాల్‌కే డిప్యూటీ సిఎం, మంత్రి పదవులు తప్ప చేసిందేమీ లేదన్నారు. గిరిజన యూనివర్సిటీపై ఆయన ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతంలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఐటిడిఎలను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. గిరిజన యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు లేవన్నారు. డ్వాక్రా సంఘాల పొదుపు డబ్బులను కూడా ప్రభుత్వం మింగేసిందని అన్నారు.

ఎన్టీఆర్‌కు నివాళి

మినీమహానాడు ప్రారంభంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి పొలిట్ బ్యూరో సభ్యులు కళావెంకటరావు, అయ్యన్నపాత్రుడు, సంధ్యారాణి, మాజీ మంత్రి కిడారి శ్రవణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు తోయక జగదీశ్వరి, జయకష్ణ, మాజీ ఎమ్మెల్యేలు ఆర్పీ భంజ్ దేవ్, చిరంజీవులు నివాళులర్పించారు. అరుకు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ముఖ్యనాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

భంజ్ దేవ్ అనుచరులు గైర్హాజరు

పట్టణంలో నిర్వహించిన మినీమహానాడులో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్ దేవ్ అనుచరులు కనిపించలేదు. ఆయన మాత్రమే కనిపించారు. పాచిపెంట మాజీ ఎంపీపీ పిన్నింటి ప్రసాద్ బాబు, మక్కువ నాయకులు పెంట తిరుపతిరావుకు ఆహ్వానం లేకపోవడంతో రాలేదని తెలుస్తోంది. సాలూరు మండల మాజీ అధ్యక్షుడు చోడవరపు గోవిందరావు, ప్రస్తుత అధ్యక్షుడు ఆముదాల పరమేష్ గైరుహాజరయ్యారు.



నియామకపత్రాలు అందుకున్న అభ్యర్థులతో పిఓ విష్ణుచరణ్

శిక్షణ పొందిన బాలికలకు నియామక పత్రాలు

కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన స్కిల్ హబ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కురుపాం నియోజకవర్గంలో గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, గుమ్మలక్ష్మీపురంలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ కోర్సులో 29 మంది గిరిజన మహిళలు శిక్షణ పొందారు. వీరికి గురువారం 2050 హెల్త్ కేర్ సంస్థలో జరిగిన జాబ్ డ్రైవ్ లో 20 మంది గిరిజన మహిళలు ఉద్యోగం పొందారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్ చేతుల మీదుగా ఉద్యోగ అవకాశం పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేశారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులకు జెసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ జిల్లా అధికారి యు.సాయికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ సత్యం

గ్రౌండింగ్ చేయడంలో ఆలస్యం వద్దు

సీతంపేట : గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన పనులపై ఇచ్చిన వినతులపై ఆలసత్యం వహించవద్దని ఎంపిడిఒ కొండపల్లి సత్యం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గడప గడపకుకార్యక్రమంలో వచ్చిన పనులపై అంచనాలు వేసి గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. అలాగే నాడు నేడు పనులు స్కూలు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. గదులు నిర్మాణాలతో పాటు విద్యుత్తు, తాగునీరు, మరుగుదొడ్లు తప్పనిసరిగా పూర్తి చేయాలని, చేసిన వెంటనే అప్లోడ్ చేయాలని అలసత్య వహించవద్దని అన్నారు. సమావేశంలో ఎంఇఒ ఆనందరావు, జెఇఇలు నీలిమ, పవన్ కుమార్, కిరణ్ కుమార్, ఎపిఎం విజయకుమారి, ఎఒ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న బేబినాయన

ఎర్రకంచెమ్మను దర్శించుకున్న బేబీ నాయన

పార్వతీపురం టౌన్ : బొబ్బిలి మున్సిపల మాజీ చైర్మన్, టిడిపి నాయకులు బేబీ నయన గురువారం జగన్నాథపురం గ్రామ దేవత ఎర్రకంచెమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఉత్సవ కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి, అమ్మవారి వంశపారంపర్య పూజారి నక్కా శ్రినువాసరావు పూజలు నిర్వహించారు. బేబీనాయనతో పాటు టిడిపి నాయకులు మజ్జి కృష్ణమోహన్, మజ్జి వెంకటేష్ , తదితరులు పాల్గొన్నారు.



టిబి రోగులకు పోషకాహార కిట్లను అందజేస్తున్న భాస్కరరావు

టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ

పార్వతీపురం రూరల్ : జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ ఎ.శ్యాంకుమార్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక డిఎంహెచ్ఒ కార్యాలయంలో టిబి వ్యాధిగ్రస్తులు, సిబ్బందితో అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా, దాతలు ద్వారా నిధులు సేకరించి, వాటితో 'పోషకాహార్ కిట్స్' వ్యాధిగ్రస్తులకు పంపిణీ నిర్వహించారు. పార్వతీపురం, పరిసర ప్రాంతాల్లోని 40మంది టిబి వ్యాధిగ్రస్తులకు దాతల సాయంతో పోషక ఆహార కిట్స్ (గుడ్లు, కందిపప్పు, నూనె, పప్పు చక్కలు) అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ డి.భాస్కరరావు, డబ్ల్యూహెచ్వో కన్సల్టెంట్ డాక్టర్ విష్ణు, డాక్టర్ జి.వెంకటరమణ, టిబి సూపర్ వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్సవ కమిటీ సభ్యులకు చెక్కును అందజేస్తున్న ఎపిఇపిడిసిఎల్ సిజిఎం మసిలామణి

అమ్మవారి జాతరకు జెడ్‌పిటిసి విరాళం

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని జరగనున్న ఇప్పలపోలమ్మ గ్రామ దేవత పండుగ సందర్భంగా బొబ్బిలి జెడ్‌పిటిసి సభ్యులు సంకిలి శాంతకుమారి, ఎపిఇపిడిసిఎల్ సిజిఎం సంకిలి మసిలామణి లక్షరూపాయలు విరాళాన్ని అందజేశారు. పండగ నేపథ్యంలో ఈ నెల 27న నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమం ఖర్చుల నిమిత్తం ఈ విరాళాన్ని అందజేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు మసిలామణి దంపతులకు ఉత్సవ కమిటీ అభినందనలు తెలిపింది.

రూ.12.5 లక్షలతో కోల్డ్ స్టోరేజ్

వీరఘట్టం : మండలం యు.వెంకంపేట పంచాయతీ పరిధి వెంకమ్మ సాగరం వద్ద గల రైతు ఉత్పత్తి దారుల సంఘ కార్యాలయం వద్ద రూ.12.5 లక్షలతో కోల్డ్ స్టోరేజ్ పనులు చేపడుతున్నట్లు రైతు ఉత్పత్తిదారుల సంఘం సిసి వై.ఆనంద్ గురువారం తెలిపారు. రూ.9,37,500తో ఉద్యాన శాఖ నిధులతో రూ.3లక్షల 12,500తో రైతు ఉత్పత్తిదారుల సంఘం నిధులతో నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం పునాది పనులు పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.



నిర్మాణంలో ఉన్న కోల్డ్ స్టోరేజ్

గిరిజన సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలో జూన్ 16, 17 తేదీల్లో జరగనున్న ఎపి గిరిజన సంఘం 7వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు కె.సంగమ్మ, కె.చిలకమ్మ కోరారు. మండలంలోని సీసాడవలసలో మహాసభల వాల్‌పోస్టర్‌తో చేతపట్టుకొని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని, గిరిజన హక్కులను కాలరాసేలా చట్టాలు తీసుకొస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో వీటికి వ్యతిరేకంగా ప్రతిఘటించేందుకు చేపట్టబోయే పోరాటాలను ఈ మహాసభల్లో చర్చించనున్నట్టు తెలిపారు. కావున ఈ మహాసభలకు జిల్లాలోని గిరిజనులంతా పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రెడ్డి శివున్నాయుడు, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, గిరిజనులు రామారావు, ప్రసాద్, వెంకటేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : జూన్ 16, 17లో కురుపాంలో జరగనున్న గిరిజన సంఘం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి, రావికోన సర్పంచ్ కె.రామస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం లచ్చన్నదొరవలసలో గిరిజన సంఘం ఏడో జిల్లా మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కె.రామస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన హక్కులపై దాడి చేస్తున్నాయని, ఆ దాడులు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే బోయ వాల్మీకులను గిరిజన తెగలను కలపాలని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తున్నామని, అటవీ హక్కు చట్టాన్ని తుంగలో తొక్కి గిరిజనులకు అన్యాయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కుట్రపన్నుతున్నాయని, పర్యావరణ పరిరక్షణ పేరుతో ఈరోజు గిరిజనులను అడవికి దూరం చేయాలని చూస్తోందన్నారు. వీటన్నింటిపైనా కలిసికట్టుగా ఉద్యమించాలని, గిరిజనులపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఒక వేదిక కాబోతున్నది కాబట్టి ఆర్థికంగా అంతా సహకరించి గిరిజన సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పి.రాము తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం : మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజనులు

తాగునీటి సరఫరాకు చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో గ్రామ దేవతల పండుగ సందర్భంగా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటిని సరఫరా చేయాలని బుధవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడును, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న విద్యుత్ అంతరాయం దృష్ట్యా పట్టణంలో మంచి నీటి సరఫరాలో అంతరాయం కలుగకుండా ముందస్తు జాగ్రత్తగా బూస్టర్ పంపు హౌస్, తోటపల్లి హెడ్ వాటర్ వర్క్సు వద్ద 3 జనరేటర్లు అద్దె ప్రాతిపదికన ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. నీటి సరఫరా లేని ప్రదేశాల్లో ప్రస్తుతం నీటి సరఫరా చేస్తున్న పురపాలక సంఘ నీటి సరఫరా ట్యాంకులకు అదనంగా మూడు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్లను అద్దె ప్రాతిపదికగా తీసుకొని నీటి సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. పట్టణ ప్రధాన రహదారులైన బైపాస్ రోడ్డు, పాలకొండ రోడ్డుపై జంక్షన్, రాయఘడ రోడ్డులో వాటర్ పైపు లైను లీకులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలన్నారు. పండుగ దృష్ట్యా నీటి సరఫరాకు అంతరాయం కలుగకుండా మున్సిపల్ కార్యాలయ సిబ్బంది 24 గంటలు అందుబాటులో వుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణ తాగునీటి సర్వీసులు కొరకు తోటపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాల్సిందిగా ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. పట్టణ నీటి సరఫరాలో ఎటువంటి అంతరాయం కలిగినా బి.అప్పలరాజు, నీటి సరఫరా వార్డు ఇన్చార్జ్ - 7981843975, జి.రామబ్రహ్మరాజు నీటి సరఫరా వార్డు ఇన్చార్జ్ (ఔట్ సోర్సింగ్) - 9949976823, జి.కళ్యాణ్- వాటర్ ట్యాంకర్ డ్రైవర్ 7076886040, కె.భాస్కరరావు, వాటర్ ట్యాంకర్ డ్రైవర్ (ఔట్ సోర్సింగ్) - 9492592537 నెంబర్లకు ఫిర్యాదులు చేయాలని సూచించారు.

జీడిపిక్కల కొనుగోలులో తప్పుడు ప్రచారం మానుకోవాలి

ప్రజాశక్తి - కొమరాడ

జీడిపిక్కల కొనుగోలులో ఐకెపి అధికారులు తప్పుడు ప్రకటనలతో జిల్లా ఉన్నతాధికారులను మోసం చేయడమే తప్ప ఎక్కడా కేజీ జీడి పిక్కలు కొనుగోలు చేయని పరిస్థితి ఉందని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండలంలోని దేవకోన పంచాయతీ అంటివలసకు చెందిన జీడిసాగు చేసే గిరిజన రైతులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొమరాడకు చెందిన వినోద్ కుమార్ జీడిపప్పు తయారీ ఫ్యాక్టరీని నిర్మించగా ఆ ఫ్యాక్టరీని ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వెలుగు ఎపిడి సత్యం నాయుడు ఇటీవల పరిశీలించారన్నారు. ఆ సందర్భంగా ఆయన గిరిజనులను ఆర్థికంగా ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారని తెలిపారు. గిరిజన జీడి రైతులు మోసపోకుండా అన్ని విధాలుగా చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని, అలాగే ఇక్కడ సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు జీడీ పీక్కలను కొనుగోలు చేస్తామని ప్రకటించారన్నారు. అయితే ఇప్పటికీ ప్రభుత్వం నుంచి ఒక్క జీడిపిక్క కొనుగోలు చేయలేదన్నారు. ఇప్పటికే 95 శాతం జీడి పిక్కలు దళారులు కొనుగోలు చేయగా ఇంకా ఉన్న 5శాతం పిక్కలు ఎంత రేటుకు కొనుగోలు చేస్తారని? ఎప్పుడు కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా గిరిజనులను ఆర్థికంగా ఆదుకోవాలనే చిత్తశుద్ధి ఉంటే వారి వద్ద ఉన్న మిగతా 5శాతం జీడి పిక్కలు కిలో రూ.180 చొప్పున కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే వెంటనే జీడి పప్పు తయారు చేసే ఫ్యాక్టరీ తెరిపించి జీడి పండించే గిరిజన రైతులను ఆదుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు ఊయక వెంకటేశు, మెల్లిక బలరాం, కె.సంగమ్మ పాల్గొన్నారు.



గ్రామస్తులకు కపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఆవాలవలసలో గడపగడపకు...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని బూర్జి సచివాలయం పరిధిలో గల ఆవాలవలసలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం స్థానిక ఎమ్మెల్యే ఎ.జోగారావు ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. వారికి ఎటువంటి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు, గ్రామంలో గల సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి వెంటనే పరిష్కారమయ్యేలా చూడమని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, స్థానిక సర్పంచ్ గుజ్జల దాసు, వివిధ గ్రామాల సర్పంచులు బొన్నాడ తిరుపతిరావు, గునుపూరు అన్నం నాయుడు, బలగ శ్రీనివాసరావు, తెంటు రామారావు, వైసిపి సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, ఆర్వీ, వై.రాధాకృష్ణ, పరువాడ అచ్యుత నాయుడు, బోగి శంకరరావు, సోషియల్ మీడియా ఇన్‌ఛార్జి బిశివ, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

తూడిలో...

వీరఘట్టం: మండలంలోని తూడిలో గురువారం స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గూర్చి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వెంకటరమణ, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, ఉపాధ్యక్షులు పి.విజయకుమారి, ఎఎంసి ఉపాధ్యక్షులు పొట్నూరు లక్ష్మణరావు, సచివాలయ కార్యదర్శి ఎ.చిన్నారావు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మోహన్ సుధీర్ పట్టా సేవలు శ్లాఘనీయం

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని అడ్డాపుశీలను స్మార్ట్ విలేజ్‌గా అభివృద్ధి చేయాలనే సంకల్పంతో స్వచ్ఛంద సేవకుడు, ఎన్ఆర్ఐ మోహన్ సుధీర్ పట్టా గ్రామాన్ని దత్తత తీసుకుని గత కొన్నేళ్లుగా గ్రామానికి అవసరమైన అనేక మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదగా నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. మొదటగా మహిళలు తమ కాళ్లపై తాము నిల్చొని స్వయం ఉపాధి పొందాలనే ఉద్దేశంతో ఆధునిక కుట్టుమిషన్లు, ఇతర పరికరాలు, సామగ్రి సమకూర్చి తద్వారా మహిళలకు ఉచితంగా కుట్టుపని, ఎంబ్రాయిడరీ, ఆధునిక టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేసిన ఈ శిక్షణా కేంద్రంలో మహిళలంతా చక్కగా అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పని నేర్చుకొని మీ కాళ్లపై మీరు నిలబడేలా కృషి చేయాలని కోరారు. శిక్షణా కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన మాజీ ఎంపిటిసి సభ్యులు అక్కినేని సుందరం నాయుడు, స్థానిక సర్పంచి కుమారుడు రామకృష్ణకు ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

ప్రజాశక్తి - బలిజిపేట

మండలంలోని పెదపెంకిలో గల నేతాజీ గ్రంథాయాలనికి ప్రముఖ విద్యా వేత్త తెర్లాం మండలం లోచర్లకు చెందిన గంట అప్పలనాయుడు పుస్తకాలు అందజేశారు. గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవ నాయుడు ఈ పుస్తకాలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ సంజీవనాయుడు ఇంకా మంచి పనులు, కార్యక్రమాలు గ్రామంలో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఆయన చేసిన కార్యక్రమాలు, మంచి పనులు ఫేస్‌బుక్, దిన పత్రికల్లో చూస్తున్నానని భవిష్యత్‌లో ఎటువంటి సహాయం కావాలన్నా తన సహకారం ఉంటుందని అప్పలనాయుడు భరోసా ఇచ్చారు.



సంజీవరావుకు పుస్తకాలు అందజేస్తున్న అప్పలనాయుడు

చెరువుల నిండా నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించి, వర్షాలు కురవక ముందే జిల్లాలోని చెరువుల్లో పూర్తిగా నీరు నిల్వ ఉండేలా చర్యలు చేపట్టాలని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వి.దాలినాయుడు కోరారు. పట్టణంలో ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవిరెడ్డి రఘు సత్య, సింహ చక్రవర్తి, పట్టణ అధ్యక్షులు శిగడాం భాస్కరరావు, మండల అధ్యక్షులు బలగ శంకర్రావుతో కలిసి గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా దాదాపుగా వర్షాధారమని, రైతులు తమ వ్యవసాయాన్ని రుతుపవనాలపై ఆధారపడి పంటలు పండిస్తారన్నారు. జిల్లాలో పలు చెరువులు మదుములు, కానాలు, షట్టర్లు పాడయ్యాయని వాటిని తక్షణమే మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలన్నారు. విరివిగా వర్షాలు కురిసేటప్పుడు కొన్ని చెరువులు గట్లు బలహీనంగా ఉండడం వల్ల గట్లు తెగిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు. కావున ముందుగానే సంబంధిత శాఖలకు చెందిన అధికారులు చెరువుల్లో నీరు పూర్తిగా నిల్వ ఉండేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరారు. దీనిలో భాగంగా చెరువుగట్లను బలంగా తీర్చిదిద్దడం, పాడైన కానాలు, మదుములు, షట్టర్లు పునరుద్ధరించాలన్నారు. ఆయకట్టు భూములకు పూర్తిగా చెరువు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పార్టీ పటిష్టతకు పనిచేయాలి

ప్రజాశక్తి - పాలకొండ

నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టిడిపి సీనియర్ సామంతుల దామోదరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆయన స్వగృహంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తనతో పాటు పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి పాలకొండలో విజయం సాధించేందుకు అంతా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వంజరాపు ఈశ్వరరావు, గుమ్మడి సింహాద్రి, పైల సత్తిబాబు, ఎ. నాగబాబు, గణేష్, లావేటి మౌళి, బొత్స రాఘవరావు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు తుమరాడ చంద్రినాయుడు, వారాడ ధనుంజయరావు, దుర్గారావు, సోంబాబు, రణస్థలం రాజారత్నం నాయుడు, జనార్ధనరావు, గణపతి, మజ్జి జయశంకర్, పొగిరి వెంకటరమణ, నగరపు శ్రీరాములు, పైల సురేష్, తాడేలా శ్రీనివాసరావు, తమరాపు వెంకటేశ్వరరావు, యారకరాయపురం, బాబ్జి నాయుడు, కిమిడి సంగం నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యు.వెంకంపేటలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని యు.వెంకంపేటలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జి.ప్రదీప్‌కుమార్ గర్భిణీలు, బాలింతలు, మధుమేహం, రక్తపోటు, జ్వరపీడితులు తదితరమైన వ్యాధిగ్రస్తులను తనిఖీలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఎండల తీవ్రత అధికంగా ఉండడం వల్ల వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని వీటిని దృష్టిలో పెట్టుకొని బయటకు గొడుగు వేసుకొని రావాలని ప్రజలకు సూచించారు. అలాగే చల్లని పానీయాలతో పాటు ఒఆర్ఎస్ కూడా తీసుకోని ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఒ.శాంతకుమారి, టెక్నీషియన్ సురేష్, ఎఎన్ఎం సరస్వతి, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో విజ్ఞాన శిబిరం

సీతానగరం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పద్దెనిమిదవ రోజు పిల్లలకు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞాన పరమైన పరిజ్ఞానం పుస్తకాలు చదివారు. ఎక్కువ మంది విద్యార్థినులు పాల్గొన్నారు. సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పద్దెనిమిదవ రోజు పిల్లలకు శతక పద్యాలు పోటీ పెట్టారు. ఎక్కువ మంది పిల్లలు పాటల పోటీలో పాల్గొన్నారు. శుక్రవారం పొడుపు కథలు పోటీ వుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ మాష్టర్ మురళీ కష్ణ, గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్ : మండలంలోని సింగన్నవలసలో జరుగుతున్న జాతీయ ఉపాధి పనులను ఎంపిడిఒ దొంక త్రినాధులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన దారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

గిరిజన చట్టాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

గిరిజన చట్టాలను ప్రభుత్వం పక్కా అమలు చేసి, అధిక ప్రాధాన్యత ఇవ్వాలని గిరిజనులు నిరసన తెలిపారు. మండలంలోని జీలికవలస, చిట్టెలబ, సిల్లమామిడి జంక్షన్ వద్ద గిరిజన సంఘ నాయకులు శిల్పజన్ని శ్రీరాం, కొర్ర కల్యాణ్ ఆధ్వర్యంలో గిరిజన చట్టాలు అమలు చేయాలని, గ్రామసభలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పీసా చట్టం అమలు చేయాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలు షెడ్యూల్ గ్రామాల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన చట్టాలను తుంగలోతోస్తూ రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టీలో పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బోయ వాల్మీకులు, బెంతు వరియాలను గిరిజన జాబితాలో చేర్చే అసెంబ్లీ తీర్మానాన్ని వెంటనే రద్దుచేసి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే మౌలిక సదుపాయాల్లేక గిరిజనులు విద్య, వైద్యానికి దూరం అవుతున్నారని, వారికి ఎటువంటి భరోసా ఏమని ప్రభుత్వాలు మళ్లీ గిరిజనులకు ఇలా ద్రోహం చేయడం సరైంది కాదని, దీనిపైన గిరిజనులంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. గిరిజనులకు మద్దతుగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ గిరిజనులు చేస్తున్న న్యాయ పోరాటానికి అన్ని ప్రజా సంఘాల ప్రజలు రాజకీయ పార్టీలకు అతీతంగా అండగా నిలబడాలని, నాన్ షెడ్యూల్ గ్రామాలన్నీ షెడ్యూల్ గ్రామాల్లో చేర్చి గిరిజన భూములకు రక్షణ కల్పించాలని, గిరిజన హక్కులను కాపాడాలని అన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజనులు

వాలంటీర్ల సేవలతోనే ప్రభుత్వానికి గుర్తింపు

ప్రజాశక్తి - సాలూరు

రాష్ట్రంలో వాలంటీర్ల సేవల వల్లే ప్రభుత్వానికి గుర్తింపు లభించిందని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. గురువారం స్థానిక సీతారామ కల్యాణమండపంలో వాలంటీర్లకు వందన కార్యక్రమంలో భాగంగా సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులు అందుకున్న వాలంటీర్లను ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా పని చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన పేదలకు చేర వేయడంలో వారి పాత్ర వెలకట్టలేనిదని అన్నారు. వృద్ధులు, వితంతువులకు, వికలాంగు లకు తెల్లారే సరికి పింఛన్లు పంపిణీ చేస్తున్న ఘనత వారిదేన న్నారు. సంక్షేమ పథకాలు కొన సాగాలంటే మళ్లీ సిఎంగా జగన్ రావాలని రాజన్నదొర కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పువ్వుల ఈశ్వరమ్మ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు జర్జాపు ఈశ్వరరావు, వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు, కౌన్సిలర్లు గొర్లి వెంకటరమణ, పప్పల లక్ష్మణరావు, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ పాల్గొన్నారు.



వాలంటీర్లకు పురస్కారాలను అందజేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

అంగన్వాడీ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని అడ్డాపుశీల అంగన్వాడీ కేంద్రాలను గురువారం సిడిపిఒ శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు రక్తహీనత మెరుగుపర్చేందుకు ఇవ్వాల్సిన మాత్రలు సక్రమంగా పంపిణీ జరుగుతున్నదీ లేనిదీ పరిశీలించారు. అనంతరం కేంద్రంలోని దస్త్రాలను పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సేవలు మరింత మెరుగుపర్చేందుకు సూచనలు అందించారు.


విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రతి రైతు వారి పరిధిలో గల రైతు భరోసా కేంద్రంలో వరి విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 26 నుంచి 31 వరకు వరి విత్తనాల కోసం రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు, వారికి కావాల్సిన విత్తనాలు రకాన్ని బట్టి నగదును తీసుకొని ఆర్బికే కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగుల నిరాహారదీక్ష

పాలకొండ రూరల్: తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం పాలకొండ తాలూకా యూనిట్ అధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఒక్క రోజు నిరాహార దీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తమ ప్రధాన డిమాండ్ల సాధన కొరకు నినదించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య సంధానకర్తగా నూతులపాటి భరత్‌భూషణ్‌రాజు, ముఖ్యఅతిథిగా ఎం.సింహాచలం (జిల్లా కార్యదర్శి), తాలూకా అధ్యక్షులు బి.జగదీశ్వరరావు, కార్యదర్శి బబ్బురు గణేష్‌బాబు, జె. రవీంద్ర కుమార్, వి.రమేష్ నాయుడు, విఆర్ఒ సంఘం జిల్లా నాయకులు మదన్, జయ కుమార్, బివి రమణ, సూర్యనారాయణ, సంపత్ కుమార్, కె.చిరంజీవులు, మల్లేసు, సత్యనారాయణ, ఎస్.శ్రీకాంత్, కొంచాడ జాన్, బలివాడ సాయి, వైద్య ఆరోగ్య శాఖ రెగ్యులర్, కాంట్రాక్ట్,స్టాఫ్ నర్సు, ఉద్యోగులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు.



దీక్షలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు